క్లుప్తంగా

ఓసీల విస్తరణ చేపట్టాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కనకయ్య

ఇల్లెందు: బొగ్గు బావులకు పుట్టినిల్లు అయిన ఇల్లెందులో బొగ్గు బావులన్నీ మూత పడ్డాయి, జేకే ఓసీ, కేటీసీ ఫిట్ -3 విస్తరిస్తేనే సింగరేణికి ఇల్లెందులో మనుగడ ఉంటుందని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. సోమవారం ప్రజాభవన్‌లో జరిగిన సింగరేణి కార్మికులకు బోనస్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేటీసీ ఫిట్-3 అరవిందో కంపెనీ ఓపెన్ టెండర్‌లో తీసుకుందని, ఇల్లెందులో జేకే ఓసీలో మూతపడే పరిస్థితి ఉందని, విస్తరిస్తే ఎంతో ఉపయోగం ఉంటుందని తెలిపారు. సింగరేణి విశ్రాంతి కార్మికులకు ఖాళీగా ఉన్న క్వార్టర్లు కిరాయి ప్రాతిపదికన ఇవ్వాలని కోరారు. కార్మికులకు బోనస్ హర్షణీయం అన్నారు. సింగరేణి పుట్టినిల్లైన ఇల్లెందులో సంస్థను కాపాడి పూర్వవైభవం తీసుకరావాలని కోరారు.

డ్వాక్రా మహిళలకు మాత్రమే..

పాల్వంచరూరల్: గత ప్రభుత్వం మహిళలందరికీ రేషన్ డీలర్ల ద్వారా బతుకమ్మ చీరలను పంపిణీ చేసింది. కానీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం డ్వాక్రా, గిరిజన మహిళలకు మాత్రమే బతుకమ్మ చీరలను పంపిణీ చేయాలని ఆదేశాలు అందాయి. పాల్వంచ మండలానికి 15,150 చీరలను కేటాయించగా వాటిని సోమవారం ఎంపీడీఓ కార్యాలయానికి తీసుకొచ్చినట్లు ఎంపీడీఓ కె.విజయభాస్కర రెడ్డి తెలిపారు. వాటిని బుధవారం పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

బతుకమ్మ చీరల పంపిణీ వాయిదా

ఇల్లెందురూరల్: బతుకమ్మ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన బతుకమ్మ చీరల పంపిణీ వాయిదా వేసినట్లు తహసీల్దార్ రవికుమార్, ఏపీఎం దుర్గారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చీరెలను పంచాయతీవారీగా సర్దుబాటు చేస్తున్న క్రమంలో ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో పంపిణీని వాయిదా వేసినట్లు పేర్కొన్నారు.

ముగిసిన శిక్షణ


అధికారులతో తాగునీటి సహాయకులు

జూలూరుపాడు: మిషన్ భగీరథ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామ తాగునీటి సహాయకుల శిక్షణ తరగతులు సోమవారం ముగిశాయి. నాలుగు రోజులుగా ట్రైనర్స్ ఆఫ్ ట్రైన్ (టీఓటీ)లు రామకృష్ణ, నేజీర్‌లు నీటి నాణ్యత పరీక్షించే విధానం, ట్యాంకుల క్లోరినేషన్, వాటర్ కంటర్‌నేషన్, భూగర్భ జలాల్లో కెమికల్స్ గుర్తించడం, ట్యాంకు, చేతి పంపుల వద్ద మురుగు నీరు నిల్వడం వల్ల బాక్టీరియా ఎలా తయారు అవుతుందనే అంశాలపై తాగునీటి సహాయకులకు అవగాహన కల్పించారు.

నిత్యావసరాల పంపిణీ

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం మైలారం గ్రామ పంచాయతీకి చెందిన మల్లికాంబ పక్షవాతంతో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న కొల్లి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్పనా చౌదరి 25 కేజీల బియ్యం, నిత్యావసరాలను సోమవారం మల్లికాంబ ఇంటికి వెళ్లి అందజేశారు. ఈ కార్యక్రమంలో రూప్లా నాయక్, జలీల్ పాషా, బొబ్బల రమేష్, కుంజ రాంబాబు ఉన్నారు.

ఐద్వా సభలను జయప్రదం చేయండి

సింగరేణి(కొత్తగూడెం): మహిళా హక్కులు, భద్రత, అన్నివర్గాల క్షేమం కోసం పోరాటం చేస్తున్న అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర మహాసభలు అక్టోబర్ 21, 22, 23 తేదీలలో కొత్తగూడెంలో జరుగనున్నాయని, ఈ మహాసభలను జయప్రదం చేయాలని ఐద్వా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ సోమవారం ప్రకటనలో తెలిపింది.

అన్నదానం

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం బూడిదగడ్డ ఏరియాలోని జ్యోతి అనాథాశ్రమంలో గాంధీ పథం జిల్లా కన్వీనర్ చింతలచెర్వు గెర్షోము ఆధ్వర్యంలో సోమవారం అన్నదానం చేశారు. గెర్షోము మాట్లాడుతూ.. జ్యోతి ఆశ్రమంలో ఉంటున్న 40 మందికి అన్నదానం చేయాలని నిర్వాహకులు కోరారని, వెంటనే భోజన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

వెంకటరెడ్డికి సన్మానం

జూలూరుపాడు: కబడ్డీ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు లేళ్ల వెంకటరెడ్డిని సోమవారం జూలూరుపాడులో పడమటనర్సాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డికి కాంగ్రెస్ నాయకులు శాలువా కప్పి పూలమాలలు వేసి ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లేళ్ల గోపాల్‌రెడ్డి, అప్పిరెడ్డి, రామిరెడ్డి, ప్రవీణ్ రెడ్డి, కోటేరు సత్యం, తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ ఘాట్లలో ఏర్పాట్లు

- రూ.5.94 లక్షలు కేటాయించిన కొత్తగూడెం మున్సిపాలిటీ
- మహిళలకు ఇబ్బందులు కలగకుండా చూస్తాం: కమిషనర్
- ఏర్పాట్లు పరిశీలించిన మున్సిపల్ చైర్‌పర్సన్, సింగరేణి అధికారులు


కొత్తగూడెంఅర్బన్: బతుకమ్మ ఘాట్‌లో పనులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ సీతాలక్ష్మి

కొత్తగూడెంటౌన్: 10వ తేదీన సద్దుల బతుకమ్మ నిమజ్జనానికి ఘాట్‌ల ఏర్పాటు పనులను అధికారులు చేపట్టారు. కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని రామవరం గోధుమవాగు వద్దకు బతుకమ్మలను నిమజ్జనం చేసేందుకు, పెద్ద ఎత్తున మహిళలు తరలివస్తారు. ఈ ఏర్పాట్లకు కొత్తగూడెం మున్సిపాలిటీ రూ.5.94 లక్షల నిధులు కేటాయించినట్లు మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామి తెలిపారు.

గోధుమవాగు వద్ద..

కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని రామవరం, పోస్టాఫీస్ ఏరియా, విద్యానగర్‌కాలనీ, చమన్ బస్తీ, బాబుక్యాంప్, మేషన్ కాలనీ రైటర్ బస్తీ, పాత కొత్తగూడెం, హెడ్డాఫీస్ ఏరియా, కూలీలైన్, హనుమాన్ బస్తీ, మెయిన్ ఆస్పత్రి ఏరియాలతో పాటు ప్రాంతాల నుంచి మహిళలు బతుకమ్మలతో అధిక సంఖ్యలో గోధుమవాగు వద్దకు తరలివస్తారు. మహిళలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. అక్కడే పలు వేదికలను ఏర్పాటు చేసి బతుకమ్మలను తీసుకొచ్చే మహిళలకు ఎప్పటికప్పుడు ఆటపాటలతో పాటు సమాచారం అందించేందుకు, అనౌన్స్‌మెంట్ కోసం ప్రత్యేక కౌంటర్లును ఏర్పాటు చేయనున్నారు. వేదికలు, బారీకేడ్ల ఏర్పాట్లు, సింగరేణి, పోలీసుశాఖలతో పాటు వలంటీర్లు, స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు.

ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలి...

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని బతుకమ్మ ఘాట్‌లలో మహిళలకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి తెలిపారు. కొత్తగూడెం పట్టణంలోని వార్డు-3 పాతకొత్తగూడెం, వార్డు-12 గోధుమవాగులో పుష్కర ఘాట్‌లలో జరుగుతున్న పనులను చైర్‌పర్సన్ సోమవారం పరిశీలించారు. మాట్లాడుతూ... మహిళలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పనులన్నీ పూర్తి చేయాలని, పారిశుద్ధ్యం, చెట్ల కొమ్మలు తొలగించుట, లైటింగ్ ఏర్పాటు, మురుగు గుంతలు పూడ్చడం, తాగునీటి వసతి పనులను యుద్ధ ప్రాతికదకన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కొడగాని పరమేష్ యాదవ్, నాయకులు దుర్గ, సుధాకర్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.


సింగరేణి(కొత్తగూడెం): ఏర్పాట్లను పరిశీలిస్తున్న జీఎం కోటిరెడ్డి

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా రుద్రంపూర్‌లోని ప్రగతివనంలో 9వ తేదీన సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఫ్యామిలీ డే బతుకమ్మ ఘాట్లను, వేడుకల ఇతర ఏర్పాట్లను సోమవారం ఎస్‌ఓటూ జీఎం కోటిరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ వేడుకల్లో వేలాది మంది కార్మికులు, ప్రజలు పాల్గొననున్నందున అవసరమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. వేడుకలు కార్మిక కుటుంబాలకు తెలిసే విధంగా ప్రచారం చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం సివిల్ రామకృష్ణ, డీజీఎం (పర్సనల్) కేశవరావు, డీవైఎస్‌ఈ సివిల్ అచ్యుతరామయ్య, సీనియర్ పీఓ మజ్జి మురళి, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ వి.శ్రీనివాస్‌రావు, రెస్క్యూ ఇన్‌చార్జ్ అనంతరామయ్య, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు కేటాయించాం..



సద్దుల బతుకమ్మ వేడుకకు గోధుమవాగు వద్ద బతుకమ్మ ఘాట్‌ను ఏర్పాటు చేసి, అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నాం. కొత్తగూడెం చుట్టుపక్కల నుంచి అధిక సంఖ్యలో మహిళలు బతుకమ్మలతో తరలిరానుండటంతో పోలీసుశాఖ, సింగరేణి, స్కౌట్స్ అండ్ గైడ్స్, వలంటీర్ల సహకారంతో ఏర్పాట్లు చేస్తున్నాం. – శేషాంజన్‌స్వామి, మున్సిపల్ కమిషనర్, కొత్తగూడెం

ప్రత్యేక భద్రత..



గోధుమవాగు వద్ద సద్దుల బతుకమ్మ సంబురాలు జరగనుండడంతో ఎలాంటి అవాంఛనీయమైన సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసుల ఆధ్వర్యంలో పర్యవేక్షణ ఉంటుంది. రామవరం, కొత్తగూడెం చుట్టుపక్కల నుంచి బతుకమ్మలతో మహిళలు తరలిరానుండడంతో పోలీసులతో ఘాట్ వద్ద ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటాం. – టి.రమేష్‌కుమార్, టూటౌన్ సీఐ కొత్తగూడెం

ఇజ్రాయిల్ దాడులపై నిరసన


ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్షాల నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): అగ్రరాజ్యం అమెరికా అండతో ఇజ్రాయిల్ దేశం పాలస్తీనాపై మారణహోమం సృష్టిస్తోందని, దీనిపై ప్రపంచ దేశాలు స్పందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, సీపీఎం రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఏజే రమేష్, సీపీఐ (ఎంఎల్) చంద్రన్నవర్గం జిల్లా నాయకులు బానోత్ ఊక్లా, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా నాయకులు గోపాలరావు, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు గౌని నాగేశ్వరావు విమర్శించారు. ఇజ్రాయిల్ దాడులను నిరసిస్తూ, పాలస్తీనాకు సంఘీభావం తెలుపుతూ వామపక్ష పార్టీలు సోమవారం శేషగిరిభవన్ నుంచి రైల్వేస్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. మాట్లాడుతూ.. ఇంత మారణహోమం జరుగుతున్నా ప్రపంచదేశాలు నోరుమెదపకుండా ఉండడం అమెరికాకు భయపడటమేనన్నారు. సంవత్సర కాలంలో సుమారు 44వేల మంది ఇజ్రాయిల్ దాడిలో బలయ్యారని ఆవేదనవ్యక్తం చేశారు. సామ్రాజ్యవాద శక్తుల అండతో తమ భూభాగాన్ని ఆక్రమించి వందేళ్లుగా చిత్రహింసలకు గురిచేస్తున్న ఇజ్రాయిల్ అమానుష చర్యలను వ్యతిరేకిస్తూ పోరాడుతున్న పాలస్తీనా ప్రజలకు అండగా నిలబడాలని డిమాండ్ చేశారు. అంతర్జాతీయ సంస్థలు, ప్రపంచ దేశాలు స్పందించి పాలస్తీనాలో శాంతిని నెలకొల్పి వారికి స్వేచ్ఛగా జీవించే హక్కు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సలిగంటి శ్రీనివాస్, లిక్కి బాలరాజు, కందగట్ల సురేందర్, నిమ్మల రాంబాబు, ఉమర్ పాల్గొన్నారు.

ఇఫ్టూ విలీన సభను జయప్రదం చేయండి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: పద్నాలుగు రాష్ట్రాలలో సంఘటిత, అసంఘటిత రంగాలలో పనిచేస్తున్న టీయూసీఐలో ఇఫ్టూ విలీన బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం మండలంలోని కొమరారంలో మాస్‌లైన్ నేతలు ప్రచార పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా మాస్‌లైన్ నాయకులు ఆజ్మీర బిచ్చా, ఇఫ్టూ నేత కాంపాటి వెంకన్న మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా కార్మికవర్గంపై తీవ్రస్థాయిలో దాడి జరుగుతోందని, ఆయా దేశాల ఆర్థిక సంక్షోభాల కారణంగా శ్రమ శక్తులపైనే దాడి ప్రతాపం చూపిస్తోందని, అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాలలో సైతం పాలకవర్గాలు ప్రజలపై, కార్మికులపై దోపిడీని అణచివేతను పెంచుతున్నాయని వాపోయారు. కార్మికవర్గం ఐక్యతకు, సమష్టి ఉద్యమానికి దేశవ్యాప్త కార్మిక సంఘం కోసం ఇఫ్టూ ఒక అడుగు ముందుకేసి బలమైన కార్మిక సంఘంగా పనిచేస్తున్న టీయూసీఐగా ఏర్పడుతుందన్నారు. అక్టోబర్ 20న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే విలీనసభకు కార్మికులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాఘవులు, ముత్తమ్మ, పాషా, శంకర్, శాంతారావు, సత్యం, కోటేష్, రాములు, శ్రీను, కిషన్, ఎలేందర్, ముత్యం తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం


మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

జూలూరుపాడు: కాంగ్రెస్ ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమైందని బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ కార్యదర్శి, కేరళ రాష్ట్ర ఇన్‌చార్జ్ జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం జూలూరుపాడులో బీజేపీ జిల్లా నాయకుడు సున్నా రమేష్ నివాసంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు రుణమాఫీ, రైతు భరోసా ఇస్తామని దగా చేసిందని విమర్శించారు. ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా హైడ్రా, మూసీ నది అభివృద్ధి అని ప్రజల దృష్టి మళ్లించేందుకు డ్రామాలు ఆడుతోందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో రైతులకు ఎలాంటి షరతులు లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామంటేనే ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టినట్లు చెప్పారు. కాంగ్రెస్‌కు మోసం చేయడం వెన్నతో పెట్టిన విద్య అన్నారు. హామీలను నెరవేర్చేంత వరకు బీజేపీ ఆధ్వర్యంలో దశలవారీగా ఉద్యమాలు చేపడుతుందన్నారు. దేశ ప్రధాని నరేంద్రమోదీ వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ఎంతో కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ముమ్మరంగా సాగుతోందని, ఈనెల 15వ తేదీతో ముగుస్తుందన్నారు. అనంతరం జూలూరుపాడులో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సుదర్శన్ ప్రసాద్ తివారీ, చిలుకూరి రమేష్, శ్యామ్ రాథోడ్, నెల్లూరు కోటేశ్వరరావు, మాదినేని సతీష్, సిరిపురపు ప్రసాద్, తెల్లం నరసింహారావు, దుద్దుకూరి కార్తీక్, భూక్యా రమేష్, సిరిపురపు గోపాల్ రావు, వందనపు సుబ్బు, కిరణ్ పాల్గొన్నారు.

మనుధర్మానికి వ్యతిరేకంగా పోరాడాలి


మాట్లాడుతున్న సుభద్ర

టేకులపల్లి: కేంద్ర ప్రభుత్వం దేశంలో మతోన్మాదం ముసుగులో మనుధర్మాన్ని తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తోందని దీనిపై వ్యతిరేకంగా మహిళలు సంఘటితంగా ఉద్యమించాలని ప్రగతిశీల మహిళా సంఘం పీఓడబ్ల్యూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కల్తీ సుభద్ర, కల్తీ కోటమ్మ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో ర్యాలీ అనంతరం టేకులపల్లి మండల స్థాయి సదస్సు మండల కేంద్రంలో నిర్వహించారు. మాట్లాడుతూ.. మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులను అరికట్టాలని కోరారు. మహిళల హక్కుల కోసం, మహిళా రిజర్వేషన్లు, కుటుంబ వేధింపులు, వరకట్న వేధింపులు, అత్యాచారాలపై మహిళలు ఉద్యమించినప్పుడే మహిళలకు రక్షణ ఉంటుందన్నారు. వాటిని అరికట్టడంతో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని ఆరోపించారు.

లాభాల వాటాపై గందరగోళం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మికులు లాభాల వాటాపై గందరగోళం చెందుతున్నారని సీఐటీయూ బ్రాంచి కార్యదర్శి విజయగిరి శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2023-24 లాభాల వాటా 33శాతం ప్రకటించటం జరిగిందని, కానీ ఏ కార్మికుడి ఎంత.. అని వివరణ లేకుండా సర్క్యూలర్ జారీ చేశారని ఆరోపించారు. 7వ తేదీన జమ అవుతాయని ప్రకటించారు కానీ పూర్తి వివరాలు లేకుండా, ప్లే సిప్పులు లేకుండా యాజమాన్యం నిర్లక్ష్యం చేయటం గర్హనీయమని, కార్మికులతో ఈ విధంగా ఆడుకోవటం సరికాదని పేర్కొన్నారు.

దుకాణాలకు పంచనామా

పాల్వంచరూరల్: కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయం వద్ద గల పాతకాంప్లెక్స్‌లోని 1నంబర్ షాపు, కొత్తకాంప్లెక్స్‌లోని 4నంబర్ షాపును గతేడాది వేలంపాటలో అద్దెకు తీసుకున్న గణేష్ అనే వ్యాపారి సుమారు పది నెలలుగా అద్దె చెల్లించకుండా షాపులకు తాళం వేశాడు.

సోమవారం ఎండోమెంట్ అధికారులు పి.భైల్‌సింగ్, ఆర్ఐ హచ్యా పోలీసు అధికారుల సమక్షంలో పంచనామా చేసి ఆ షాపులను తెరిపించినట్లు ఈఓ ఎన్.రజనీకుమారి తెలిపారు. సదరు షాపులను ఇటీవల వేలంపాటలో ఇతరులు దక్కించుకున్నందున్న ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.

పెండింగ్ పనులు పూర్తి చేయండి..


మాట్లాడుతున్న ఎంఈఓ ప్రభుదయాళ్

కొత్తగూడెంఅర్బన్: పనుల్లో పెండింగ్ లేకుండా విధులు నిర్వహించాలని మండల విద్యాశాఖాధికారి ప్రభుదయాళ్ అన్నారు. సోమవారం కొత్తగూడెం మండల విద్యా వనరుల కేంద్రంలో సిబ్బందితో జరిగిన సమావేశంలో ఎంఈఓ మాట్లాడారు. మండలంలోని పాఠశాలల సమచారాన్ని కేంద్రీకరిస్తూ జిల్లా విద్యాధికారులు అడిగే సమచారం, రిపోర్టులను వెంటనే సరైన వివరాలతో పంపించాలని సూచించారు. డీఎస్‌సీ ద్వారా నూతనంగా చేరనున్న టీచర్లకు అవసరమయ్యే సర్టిఫికెట్లను సిద్ధం చేయాలని సూచించారు. ఈ సమవేశంలో సీసీఓ, సీఆర్పీలు, ఎంసీఓ, ఎంఐఎస్ కోఆర్డినేటర్, క్లస్టర్ నోడల్ అధికారి తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణులను సంరక్షించాలి


మాట్లాడుతున్న రేంజర్ మాధురి

పాల్వంచరూరల్: అడవిలో సంచరించే జంతులకు హాని తలపెట్టకుండా వాటిని సంరక్షించాలని యానంబైల్ రేంజర్ కవిత మాధురి కోరారు. వన్య ప్రాణి వారోత్సవాల్లో భాగంగా సోమవారం యానంబైల్ రేంజ్ పరిధిలోని పెద్దకలశ, చిరుతానిపాడు గుత్తికోయ గిరిజన గ్రామాల్లో వైల్డ్‌లైఫ్ సిబ్బంది ప్రదర్శన నిర్వహించి గిరిజనులకు వన్యప్రాణులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రేంజర్ మాట్లాడారు. జంతులను వేటాడితే చట్టప్రకారం శిక్షలు పడతాయన్నారు. గ్రామాల్లోకి జంతువులు వస్తే ఫారెస్ట్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైల్డ్‌లైఫ్ బీట్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి..


వాహనాలను పరిశీలిస్తున్న డీఎస్పీ రెహమాన్

కొత్తగూడెంఅర్బన్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్ అన్నారు. సోమవారం ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో పట్టుకున్న వాహనాలను పరిశీలించి, వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. మాట్లాడుతూ.. నాలుగు రోజుల స్పెషల్ డ్రైవ్‌లో 1200 బైక్‌లను పట్టుకున్నట్లు తెలిపారు. వీరంతా హెల్మెట్ లేకుండా, ట్రిబుల్ రైడ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, రాంగ్‌రూట్, మద్యం సెవించి పట్టుబడినట్లు చెప్పారు.

టేకులపల్లి: టేకులపల్లి పోలీసు స్టేషన్ సమీపంలో సీఐ, ఎస్ఐల ఆధ్వర్యంలో సోమవారం వాహన తనిఖీలు చేపట్టారు. నిబంధనలు పాటించని వాహనదారులకు అవగాహన కల్పించారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాడాలి

పాల్వంచ: ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ తీర్పును వ్యతిరేకిస్తూ ఆందోళనలు, నిరసనలు తెలియజేయాలని మాలమహానాడు రాష్ట్ర సెక్రటరీ ఎస్.మధుసూదన్‌రావు అన్నారు. సోమవారం మున్సిపాలిటీలోని ఎర్రగుంటలో జిల్లా సంఘం సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ... ఎస్సీ వర్గీకరణను విరమించుకునే వరకు పోరాటం ఆగదన్నారు. ఈ పోరాటంలో ప్రతీ ఒక్కరు భాగస్వామ్యం కావాలన్నారు. అనంతరం ఎర్రగుంట కమిటీని ఎన్నుకున్నారు. సలహాదారులుగా గుడివాడ నారాయణ, అధ్యక్షుడిగా సలవాది రత్నం, ఉపాధ్యక్షుడిగా ద్రాక్ష మాణిక్యరావు, నక్కా నరసింహారావు, శెట్టి నరసింహారావు, ప్రధాన కార్యదర్శిగా ద్రాక్ష సురేష్‌లను ఎన్నుకున్నారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం


నాటి ఉపాధ్యాయులతో 2009- 2010 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు

సింగరేణి(కొత్తగూడెం): చుంచుపల్లి మండలం పెనగడప జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం పూర్వవిద్యార్థులు సందడి చేశారు. 2009- 2010 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. నాడు గురువులు హోషం చలపతి, విజయలక్ష్మి, మహేశ్వరి, శాంతకుమారిలను ఘనంగా సన్మానించారు. పొక్కిలి నారాయణరావు, పోనుగోలు శివ, శ్రీను, మహేష్, ప్రవీణ్, శ్వేత, నవ్య, విజయలక్ష్మి పాల్గొన్నారు.

శ్రీ మహాచండీదేవిగా అమ్మవారు

దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఐదో రోజు శ్రీ మహాచండీదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు సోమవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం మండపాల వద్ద కుంకుమ పూజ చేసి తరించారు. కొత్తగూడెంలోని త్రిమాత శక్తి పీఠంలో చిన్నారుల నృత్యా ప్రదర్శన అలరించింది. పలుచోట్ల మండపాల వద్ద కమిటీల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. – సాక్షి నెట్‌వర్క్


టేకులపల్లి: రామాలయం ఆవరణలో..


జూలూరుపాడు: వెంగన్నపాలెం టీచర్స్ కాలనీలో


ఇల్లెందురూరల్: సుభాష్‌నగర్‌లో..


పాల్వంచ: ఆదర్శనగర్‌లో చండీహోమం


గట్టాయిగూడెంలో..


జూలూరుపాడు: రామచంద్రాపురంలో


కొత్తగూడెంఅర్బన్: త్రిమాత శక్తి పీఠంలో చిన్నారుల ప్రదర్శన


టేకులపల్లి: వీరబ్రహ్మేంద్ర స్వామి వీధిలో అమ్మవారి మండపం వద్ద అన్నదానం

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

కె. ప్రదీప్ కుమార్, ACM - 70132 21824 | లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148 | భద్రాచలం కె. హరేంద్ర - 99632 02011
పినపాక ఎన్. లక్ష్మయ్య - 80742 70476 | ఇల్లందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎన్ దుర్గారాంప్రసాద్ -9000327175 | టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎన్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

టి. రాజేష్ - 90102 23783
ఎ. నాగేశ్వరరావు - 97054 44183
ఎన్. శేషయ్య - 99121 99148